
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు

జిల్లా వార్తలు

ఆదివారం 5 అక్టోబరు 2025



ఆటో డ్రైవర్ హ్యాపీ

కర్నూలు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లలో ఆనందం రెట్టింపయింది. కష్టకాలంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేయూతగా నిలిచారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఒక్కో డ్రైవర్ల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేశారు. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించే 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నాయకులు ప్రారంభించారు. జిల్లాలో 13,495 మంది డ్రైవర్ల ఖాతాల్లో రూ.20.24 కోట్లు జమ చేశారు. బ్యాంక్ ఖాతాల్లో రూ.15 వేలు జమ అయినట్లు సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లు చూసి డ్రైవరన్నలు సంతోషం వ్యక్తం చేశారు. కొందరు డ్రైవర్ల కుటుంబాల్లో వృద్ధాప్య పింఛన్, ఇద్దరు ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం ఇప్పటికే వస్తోంది. తాజాగా ఆటో డ్రైవర్ల సేవలో.. పథకం రూ.15 వేలు జమయ్యాయి. ఈ మూడు పథకాలు ద్వారా ఒక్కో డ్రైవరన్న కుటుంబానికి ఏడాదికి రూ.93 వేలు నుంచి రూ.1.08 లక్షల మేరకు లబ్ధి చేకూరినట్లయింది. అత్యధికంగా కర్నూలు నియోజకవర్గంలో 5,169 మంది డ్రైవర్లకు రూ.7.75 కోట్లు జమ చేస్తే అత్యల్పంగా ఆలూరు నియోజవకర్గంలో 772 మంది ఆటో డ్రైవర్లకు రూ.1.16 కోట్లు జమ చేశారు. డ్రైవరు లేదా కుటుంబ సభ్యుల పేరిట సొంత వాహనం ఉండి, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారిని అర్హులుగా గుర్తించారు. అయితే డ్రైవింగ్ లెసెన్స్ ఉన్నా, ఆర్థిక స్తోమత లేకనో, బ్యాంకుల్లో రుణాలు పుట్టకనో అద్దె ఆటోలు నడుపుకుంటున్న వారికి ఈ పథకం వర్తించడం లేదు. దీంతో తాము నష్టపోతున్నామని, అద్దె వాహనం నిడిపే డ్రైవర్లకు కూడా ఈ పథకం వర్తింప చేయాలని డ్రైవర్లు కోరుతున్నారు.

- ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున రూ.20.24 కోట్లు
- జిల్లాలో 13,495 మందికి ఆర్థిక ప్రయోజనం
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం
- 'ఆటో డ్రైవర్ల సేవలో' రాష్ట్ర ప్రభుత్వం

జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు

జిల్లా కలెక్టర్ డాక్టర్ అట్టాడ సిరి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు ప్రారంభించారు. 13,495 మంది డ్రైవర్ల ఖాతాల్లో రూ.20.24 కోట్లు జమ చేశారు. ఆదోనిలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడులు ప్రారంభించారు. 1,628 మందికి రూ.2.44 కోట్లు జమ చేశారు. ఆలూరులో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఏపీ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ పీడీ చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్మన్ బిల్లెకల్లు వెంకటేశ్ ప్రారంభించి 772 మంది ఖాతాల్లో రూ.1.16 కోట్లు జమ చేశారు. పత్తికొండలో స్పెషల్ ఆఫీసర్, ఆర్డీఓ భరత్ నాయక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జడ్పీ మాజీ చైర్మన్ బత్తిని వెంకటరాముడు ప్రారంభించి 1,480 మందికి రూ.2.22 కోట్లు జమ చేశారు. మంత్రాలయంలో డీపీఓ భాస్కర్, టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి, ఏపీ కురక కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప ప్రారంభించి 1,172 మంది రూ.1.75 కోట్లు జమ చేశారు. కోడుమూరులో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించి నియోజకవర్గంలో 2,440 మందికి రూ.3.66 కోట్లు జమ చేశారు. ఎమ్మిగనూరులో నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆదోని ఎంపీఏ సుధాకర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేశ్, సీనియర్ నాయకుడు భాస్కర్ల చంద్రశేఖర్ ప్రారంభించి 1,206 మందికి రూ.1.81 కోట్లు జమ చేశారు.

రూ.15వేలు ఎంతో ఉపయోగపడుతుంది



కూటమి ప్రభుత్వం ఇచ్చే రూ.15వేలు మా ఆటో డ్రైవర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆటోకు ఇన్సూరెన్సుతో పాటు మెయింటేన్స్‌కు ఈ డబ్బును వినియోగిస్తాను. రోజువారిగా వచ్చే ఆదాయంతో మా జీవనం సాఫీగా సాగుతుంది. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- వీరేష్, శివన్ననగర్, ఎమ్మిగనూరు

సీఎం చంద్రబాబుకు థ్యాంక్స్



ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు మాకు రూ.15 వేలు ఇవ్వటం చాలా ఆనందంగా ఉంది. ఇది మా కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్న మహిళలు కూడా ఈ రంగంలోకి రావాలి. మాకు సాయం చేసిన సీఎం, కూటమి ప్రభుత్వానికి థ్యాంక్స్.

- మహాలక్ష్మి, బి.అగ్రహారం, గోనెగండ్ల మండలం

జగన్ కన్నా రూ.5వేలు అధికంగా ఇచ్చారు



జగన్ ప్రభుత్వంలో రూ.10వేలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఏకంగా రూ.15 వేలు ఇవ్వటం చాలా ఆనందంగా ఉంది. ఈ డబ్బు మాకు ఎంతో ఉపయోగపడుతుంది. మేము నలుగురు కుటుంబ సభ్యులు. ఒక్కోసారి ఆటోకు గిరాకి ఉంటే ఉంటుంది.. లేకుంటే లేదు. ఇలాంటి సమయంలో ఈ డబ్బు మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

- నరసప్ప, ఆటోడ్రైవర్, ఎమ్మిగనూరు



కల్లూరు: సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి



ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ డా.సిరి



గంగ ఒడికి దుర్గమ్మ



11 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న దేవీమాత విగ్రహాల నిమజ్జనం శనివారం కర్నూలు నగరంలో ఘనంగా ముగిసింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన దాదాపు 250కిపైగా విగ్రహాలు నిమజ్జనానికి సంకల్‌బాగ్‌లోని దుర్గాఘాట్‌కు చేరుకున్నాయి. దేవీమాత శోభాయాత్రలో నృత్యాలు, మేళతాళాలతో యువత ఉత్సాహంగా పాల్గొంది. 11 రోజుల పాటు పూజలు అందుకొని, మొక్కులు తీర్చిన దుర్గమ్మా.. వెళ్లి రావమ్మా..! అంటూ భక్తులు అమ్మవారిని సాగనంపారు. ఈ నిమజ్జన వేడుకలను మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ దగ్గరుండి పర్యవేక్షించారు.

● కర్నూలు (ఆంధ్రజ్యోతి)

వివరాలు 7లో





నిమజ్జనంలో పాల్గొన్న టీజీ వెంకటేశ్, ఎమ్మెల్యే గౌరు చరిత, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కమిషనర్ వర్సెస్ ఆర్వో

- షోకాజ్ నోటీసు ఇస్తాం: కమిషనర్
- సస్పెండ్ చేయండి ఇంటిల్లిపాది ఆత్మహత్య చేసుకుంటా: ఆర్వో
- రాజీ కుదిర్చిన మేయర్ ● సద్దుమణిగిన వివాదం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో కమిషనర్ పి.విశ్వనాథ్, ఇన్‌చార్జి రెవెన్యూ ఆఫీసర్(ఆర్వో) వాజిద్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శనివారం రెవెన్యూ విభాగానికి సంబంధించి కమిషనర్ సమావేశం ఏర్పాటుచేశారు. రెవెన్యూ వసూళ్లపై ఆర్వోను ఆరాతీశారు. ఇప్పటి వరకు ఎంత వసూలు చేశారు. గత సంవత్సరం ఎంత? అంతకుముందు ఎంత చేశారు? వాటికి సంబంధించిన వివరాలివ్వాలని ఆర్వోను కమిషనర్ కోరారు. అలాంటి వివరాలు ఏమి అవసరం లేదని, ఆపరేటర్ ఇమ్మని చెప్పినా ఇవ్వలేదని వాజిద్ సమాధానమిచ్చారు. కమిషనర్ ఆర్వోపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నేను అడిగింది చెప్పకుండా ఎవరో ఇవ్వలేదని ఎలా చెబుతారని దూషించారు. ఈక్రమంలో వాజిద్ సహనం కోల్పోయి ఏమి చేసుకుంటారో చేసుకోండి అంటూ సమావేశం నుంచి బయటికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సహచర ఉద్యోగులు వారించారు. ఇంతలో కమిషనర్ కలగజేసుకుని పనిచేయాలని చెబితే కోపం ఎందుకు అన్నారు. ఇదంతా జరుగుతుండగా ఆర్వో మరోమారు పైకిలేచి కేవలం నన్నే లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారన్నారు. ఇలాంటి విషయాలు మాట్లాడితే షోకాజు నోటీసు జారీచేస్తానని కమిషనర్ హెచ్చరించారు. షోకాజు నోటీసు ఎందుకు సస్పెండ్ చేయాలని చెప్పడంతో సరే.. సస్పెండ్ చేస్తానని కమిషనర్ చెప్పారు. మీరు సస్పెండ్ చేస్తే మా ఇంటిల్లిపాదితో వచ్చి నగరపాలక కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని బయటికి వెళ్లిపోయారు. ఈమేరకు వాజిద్ తన కుటుంబాన్ని తీసుకుని నగరపాలక కార్యాలయానికి పెట్రోల్ బాటిల్‌తో వచ్చారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్, మేయర్‌తో కలిసి



ఈవిషయంపై సుదీర్ఘంగా చర్చించారు. ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు. దీంతో గొడవ సద్దుమణిగింది. ఈక్రమంలో కొందరు ఉద్యోగులు తాము ఉద్యోగులమా.. లేక బానిసలమా అంటూ నినాదాలు చేశారు. కమిష నర్ కావాలనే రెవెన్యూ విభాగాన్ని లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు.

రమణీయం.. మాళమల్లేశ్వరుడి రథోత్సవం

- దేవరగట్టుకు పోటెత్తిన భక్తజనం
- పోలీసుల భారీ బందోబస్తు

హొళగుంద , అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బన్ని ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం బిలేహాల్ గ్రామస్థులు మేటి కుంభంతో రావడంతో రథోత్సవం ప్రారంభమైంది. రాత్రి మాళమల్లేశ్వర స్వామివారికి నెరణికి గ్రామ పురోహితులు పంచామృతము, రుద్రాభిషేకము, బండారార్చన, రథసంస్కారము, రథాంగ హోమం వంటి ప్రత్యేక పూజలను చేశారు. మాళమల్లేశ్వర స్వామివారి విగ్రహాలను రథంపై ఉంచి ఎదురు బసవన్న గుడి వరకు వైభవంగా నిర్వహించారు. రథోత్సవంలో గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. స్వామివారి రథోత్సవంను తిలకించేందుకు ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి, హొళగుంద, హాలహర్వి, చిప్పగిరి, తుగ్గలి, వెల్దుర్తి ఎస్ఐలు దిలీప్ కుమార్, మారుతీ, శ్రీనివాసులు, బాల నరసింహులు, అశోక్‌తో పాటు 47 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దేవరగట్టులో కొనసాగుతున్న మాళ మల్లేశ్వర స్వామి రథోత్సవం



జల క్రీడల హబ్‌గా కర్నూలు

- క్రీడా సంఘాల ప్రతినిధుల కృషి వెలకట్టలేనిది ● డీఈవో శామ్యూల్‌పాల్
- రాష్ట్రస్థాయి డ్రాగన్ బోట్ పోటీలు ప్రారంభం



ప్రసంగిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్



గార్గేయపురం చెరువులో డ్రాగన్ బోట్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లా క్రీడలకు హబ్‌గా కర్నూలు నిలుస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శనివారం గార్గేయపురంలోని కర్నూలు సిటీ ఫారెస్టు చెరువు సమీపంలో రాష్ట్ర స్థాయి 4వ కయాకింగ్ అండ్ కెనోయింగ్ డ్రాగన్ బోట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన క్రీడలను అభివృద్ధి చేసేందుకు జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడా సంఘాల ప్రతినిధులు చేస్తున్న కృషి వెలకట్టలేదన్నారు. జిల్లాకు జల క్రీడలను పరిచయం చేస్తున్న నిర్వాహకుల కృషి అభినం దనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి చేయూతనందిస్తామని అన్నారు. రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కర్నూలు సెంటర్ ఇన్‌చార్జి కార్తికేయన్, జిల్లా ఒలంపిక్ సంఘం సీఈవో విజయ్‌కుమార్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం కోశాధికారి డా.రుద్రరెడ్డి, జిల్లా యోగా సంఘం ఉపాధ్యక్షుడు సాయికృష్ణతో కయాకింగ్ కేనోయింగ్ అసోసియేషన్ వ్యవస్థపకుడు శివారెడ్డి, డ్రాగన్ బోట్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రెటరీ మంచికంటి అవినాష్, జిల్లా వాటర్ స్పోర్ట్స్ కోచ్ చంద్రశేఖర్, స్కేటింగ్ సంఘం జిల్లా కార్యదర్శి సునీల్‌కుమార్, ఆర్చరి సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.



బోట్ నడుపుతున్న డీఈఓ

హంద్రీకి నీటి విడుదల నిలిపివేత

గోనెగండ్ల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీనదికి నీటి విడుదలను ఇరిగేషన్ అధికారులు శనివారం ఉదయం నిలిపివేశారు. మూడు రోజులుగా వరద నీరు వచ్చి చేరడంతో నీటి విడుదల కొనసాగింది. అయితే ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం నిలిచిపోయింది. తుంగభద్ర దిగువ కాలువ నుంచి 150 క్యూసెక్కులు, హంద్రీనీవా నుంచి 60 క్యూసెక్కుల నీరు జీడీపీని చేరుతున్నాయి. ప్రస్తుతం గాజులదిన్నెప్రాజెక్టు లో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రకు నీటి మట్టం 376.75 మీటర్లు ఉంది. దీంతో జీడీపీ నిండు కుండ లా మారింది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.25 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీరు సామర్థ్యానికి తగ్గట్టుగా పూర్తిగా ఉందని ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటని ఎప్పటి కప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. రబీ సీజన్‌లో జీడీపీ ఆయకట్టు రైతులుకు నీటి ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.



జీడీపీ గేట్లను మూసివేసిన దృశ్యం










నగరంలో అమ్మవారి శోభాయాత్ర


సీతారామ నగర్‌లో దుర్గామాతను నిమజ్జనానికి సాగనంపుతున్న మహిళలు


దుర్గా ఘాట్ వద్ద భక్తులు

గంగ ఒడికి దుర్గమ్మ

- భక్తిశ్రద్ధలతో జగన్మాత నిమజ్జనం
- ఉత్సాహంగా యువత, మహిళలు నృత్యం
- సంప్రదాయలకు ప్రతీక దుర్గాదేవి నిమజ్జనోత్సవం
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకల్లో భాగంగా కొలువుదీరిన దుర్గమ్మ 11 రోజులు భక్తుల పూజలు అందుకుని శనివారం గంగమ్మ ఒడికి చేరారు. నగర వీధులు ఎటు చూసినా దుర్గామాత పూజలు, పాటలతో ఆధ్యాత్మిక శోభితమై విరాజిల్లింది. లక్షలాది భక్తుల పూజలు అందుకొని, వారి మొక్కులు తీర్చిన దుర్గామ్మా.. పోయిరావమ్మా..! అంటూ భక్తులు సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడేలా ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కనుల పండువగా నిమజ్జన మహోత్సవం కొనసాగింది. శనివారం సాయంత్రం సంకల్‌బాగ్‌లోని తుంగభద్ర నదిలో నిమజ్జనం నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఎస్పీ విక్రాంత్ పాటిల్, మేయర్ బీవై రామయ్య, విశ్వహిందు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయి రెడ్డి, బీసీ రెడ్డి, కల్కూర చంద్రశేఖర్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, నగర ప్రముఖులు దుర్గా ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు, జ్యోతి ప్రజ్వలన చేసి నిమజ్జన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ దుర్గమ్మ ప్రతిమను తలపై మోసుకొచ్చి నిమజ్జనం చేశారు. అనంతరం రావణాసుర దహనం నిర్వహించారు. దాదాపు నగర వ్యాప్తంగా 250 విగ్రహాలు నిమజ్జనానికి తరలి వచ్చాయి. సంప్రదాయ నృత్యాలతో అలరించిన కళాకారులకు జ్ఞాపికలు, శాలువాలతో టీజీ వెంకటేశ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయాల సమ్మేళనమే దుర్గామాత వేడుకలు అన్నారు. ఉత్సవం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ తరువాత ఆ స్థాయిలో దేవిశరన్నవరాత్రులు కర్నూలు నగరంలో జరుపుకోవడం గర్వకారణమన్నారు.








కళాకారులతో టీజీ వెంకటేశ్, ఎస్పీ దంపతులు



మహానందీశ్వరుడి సన్నిధిలో సినీ దర్శకులు


అర్చకుల ఆశీర్వాదం పొందుతున్న సినీ దర్శకులు హరీశ్ శంకర్, వశిష్ఠ

మహానంది, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మహానందీశ్వరుడిని తెలుగు సినీ దర్శకులు హరీశ్ శంకర్, వశిష్ఠ(బింబిసారా ఫేమ్) శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద వీరికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి అభిషేకం, కామేశ్వరీదేవి ఆలయాల్లో కుంకుమార్చన పూజలను చేశారు. అలంకార మంటపంలో ఆలయ అర్చకులు సుబ్బయ్యశర్మ, జనార్దన్‌శర్మ ఆశీర్వదించి, ప్రసాదాలను అందజేశారు. ఈసందర్భంగా ఆలయం వెలుపల దర్శకులతో అభిమానులు ఫొటోలు దిగడానికి ఆసక్తి చూపారు. ప్రస్తుతం పవన్‌కల్యాణ్ హీరోగా శ్రీలీల హీరోయిన్ నటిస్తున్న సినిమాకు దర్శకత్వం వహిస్తున్నట్లు హరీశ్ శంకర్ తెలిపారు. చిరంజీవి హీరోగా నటిస్తున్న విశ్వంభర చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నట్లు దర్శకుడు వశిష్ఠ వివరించారు.

అహోబిలేశుడిని దర్శించుకున్న ప్రముఖ సినీ దర్శకులు

ఆళ్లగడ్డ: అహోబిలం క్షేత్రాన్ని శనివారం విశ్వంభర సినిమా దర్శకుడు వశిష్ఠ, గబ్బర్ సింగ్ సినిమా దర్శకుడు హరీష్ శంకర్ దర్శించుకొని లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. నవ నవసింహ క్షేత్రాలలోని ఏడు ఆలయాలను వారు దర్శించుకొన్నారు. ఆలయ వేద పండితులు వారికి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. వారి వెంట అహోబిల ఈవెంట్ మేనేజర్ బొప్పా సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఓటు హక్కును కాలరాస్తున్న బీజేపీ

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్


సంతకాలు సేకరిస్తున్న లక్ష్మీనరసింహయాదవ్

కల్లూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు లక్ష్మీనరసింహయాదవ్ ఆరోపించారు. శనివారం దొంగ ఓటుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి చేపట్టిన సంతకాల సేకరణకు విశేష స్పందన లభించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల తీరు వచ్చిన ఫలితాలు చూస్తుంటే ఎన్నికల సం ఘాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీ మోసాలకు పాల్పడుతుందన్నారు. కేంద్రంలో అధికా రమే పరమావధిగా బీజేపీ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తోందని అన్నారు. ఓట్ చోరీపై దేశవ్యాప్తంగా మరో ఉద్యమం రానుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, రజాక్‌వలి, జాకీర్‌హుసేన్, విశ్వేశ్వరరెడ్డి, బోయరమణ పాల్గొన్నారు.

త్రీటౌన్ సీఐపై వేధింపుల ఆరోపణలు

నంద్యాల టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల త్రీటౌన్ సీఐపై పలు వేధింపుల ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని మూలసాగరానికి చెందిన ఒక మహిళను గతంలో కానిస్టేబుల్ (నకిలీ వ్యక్తి) అని వేధిస్తుండటంతో అతడి నుంచి రక్షణ కల్పించాలని ఆమహిళ త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడ పట్టించుకోకపోవడంతో ఎస్పీ కార్యాలయంలో జరిగే పీజీఆర్‌లో ఫిర్యాదు చేయగా మళ్లీ అక్కడి నుంచి త్రీటౌన్‌కు వెళ్లాలని సూచించారు. బాధిత మహిళ రెండు వారాల నుంచి పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి న్యాయం జరగలేదు. ఇదే కాకుండా సీఐ తనను అసభ్యకర పదజాలంతో, లైంగికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె తెలిపారు. సీఐపై గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నట్టు సమాచారం. దీనిపై సీఐను వివరణ అడగగా ఇందులో ఎలాంటి వాస్తవాలు లేవని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ నాయకులు బెదిరించి తీసుకెళ్లారు

- సొంతగూటికి చేరిన నూతనపల్లె ఎంపీటీసీ లక్ష్మీదేవి


ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్ సమక్షంలో తిరిగి టీడీపీలో చేరుతున్న నూతనపల్లె ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఆమె కుమారుడు కృష్ణ

కర్నూలు రూరల్ అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తనను, తన కుటుంబ సభ్యులను బెదిరించి తీసుకెళ్లి పార్టీ కండువా కప్పినట్లు నూతనపల్లె ఎంపీటీసీ లక్ష్మీదేవి పేర్కొన్నారు. శనివారం లక్ష్మీదేవి, ఆమె కుమారుడు కృష్ణ, మనవడు మహేష్, నాగేంద్ర సొంత గూటి(టీడీపీలో)కి చేరారు. ఈనెల 2న కేడీసీసీబీ చైర్మన్ విష్ణువ ర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సమక్షంలో ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఆమె కుటుంబసభ్యులు వైసీపీని వీడి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. శుక్రవారం కోడుమూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కోట్ల హర్షవ ర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొందరు నాయకులు వీరందరిని తీసుకెళ్లి వైసీపీ కండువాను కప్పి ఫొటోలు, వీడియోలు తీశారు. సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేశారు. విషయం తెలిసిన వెంటనే విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి నూతనపల్లెకు వెళ్లారు. ఎంపీటీసీ లక్ష్మీదేవి, ఆమె కుటుంబ సభ్యులను జరిగిన ఘటనపై ఆరాతీశారు. మీకు, మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎంపీటీసీ కుటుంబ సభ్యులు కర్నూ లుకు వచ్చి జరిగిన ఘటనను మీడియాకు వివరించారు. కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ భర్త వాసు మరికొంతమంది వైసీపీ నాయకులు తన కుటుంబ సభ్యులను బెదిరించి తనను బలవంతంగా తీసుకెళ్లినట్లు వారు వాపోయారు. వైసీపీలో ఉన్నంతకాలం అప్పుల ఊబిలో కూరుకు పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసే వారికి ఆ పార్టీలో న్యాయం జరగడం లేదన్నారు. అందుకే వైసీపీని వీడి తిరిగి టీడీపీలో చేరుతున్నామన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి


తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రవీణ్‌కుమార్

మంత్రాలయం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి మంత్రాలయంలో బసచేసిన విషయం తెలిసిందే. ఆలయ ముఖద్వారం వద్ద ఆయనకు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్‌జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్, జయతీర్థఆచార్, వ్యాసరాజాచార్, రంగస్వామి, లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర ఉన్నారు.

పార్కింగ్‌లో వివాదం.. ఒకరిపై దాడి

కర్నూలు క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలో హైదరాబాద్‌కు వెళ్లే వాహనాల పార్కింగ్‌లో వివాదం చోటుచేసుకుంది. విక్రమ్ అనే కారు డ్రైవర్ హైదరాబాదుకు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు బళ్లారి చౌరస్తా వద్ద కారు పార్కింగ్ చేశాడు. మరో కారు డ్రైవర్ రాధా కృష్ణ అభ్యంతరం వ్యక్తంచేస్తూ విక్రమ్‌పై దాడి చేశాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆ ప్రాంతంలో కారు పార్కింగ్ చేయకుండా ఆంక్షలు విధించారు.

డయాబెటిక్ కిడ్నీతో కూతురికి జీవం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మెడికవర్ హాస్పిటల్స్‌లో డయాబెటిక్ బాధితురాలైన తల్లి తన కిడ్నీని కూతురికి ఇచ్చింది వైద్యులు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. వివరాల మేరకు.. డోన్‌కు చెందిన ప్రత్యూష(34)కు రెండు కిడ్నీలు చెడిపోయాయి. కూతురుని కాపాడుకోవాలని తల్లి జయమ్మ(55) కూతురుని కాపాడుకోవడం కోసం తన కిడ్నీని డొనేట్ చేయాలని నిర్ణయించుకుంది. అయితే తల్లికి షుగర్ ఉండటంతో కొంత ఆలోచించి మెడికవర్‌లో సంప్రదించారు. డా.సిద్ధార్థ హేరూర్, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు, మూత్రపిండ మార్పిడి వైద్యులు అవగాహన కల్పించి, పరీక్షల అనంతరం సెప్టెంబరు 27న మార్పిడి నిర్వహించారు. సర్జరీ నఅంతరం బాధితురాలి క్రియాటినిన్ 0.8 ఉందని, యూరిన్ ఔట్‌పుట్ 5 ఎల్‌టీఎస్ రావడంతో వంద శాతం విజయవంతమైనట్లు వైద్యులు తెలిపారు. అనంతరం రోగిని డిశ్చార్జి చేశారు.

టైరు పడి వృద్ధుడి దుర్మరణం

కర్నూలు క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ లారీ టైర్లు ప్రమాదవశాత్తు ఊడి పడటంతో ఓవృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన కర్నూలులోని కృష్ణానగర్ ఐటీసీ సర్కిల్ వద్ద చోటుచేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వివరాలు.. స్థానిక శరీన్‌నగర్‌కు చెందిన వీరబ్రహ్మేంద్ర(65) బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. తమిళనాడు నుంచి ఓకంటైనర్ చెరుకు కటింగ్ యంత్రాన్ని యాదగిరి గుట్టకు తీసుకెళ్తోంది. ఐటీసీ ఫ్లైఓవర్ మీద ఆ కంటైనర్ రెండు టైర్లు ప్రమాదవశాత్తు ఊడిపోయాయి. రెండు టైర్లు దొర్లుకుంటూ వచ్చి కింద ఉన్న ఓ ఆటో, మోటారు బైక్‌పై పడ్డాయి. అదే మార్గంలో నడుచుకుంటూ వెళ్తున్న వీరబ్రహ్మేంద్రపై కూడా పడటంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఆటో దెబ్బతింది. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాని బహిరంగ సభకు స్థల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

ఓర్వకల్లు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ మండలంలో పర్యటించారు. ప్రధాని పర్యటించబోయే ప్రదేశాలతో పాటు బహిరంగ సభ జరిగే ప్రాంతాన్ని వారు పరిశీలించారు. మండలంలోని గుట్టపాడు గగ్రామ సమీపంలోని జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమ వద్ద, నన్నూరు సమీపంలో ఉన్న రాగమయూరిలోని మరో ప్రదేశాన్ని బహిరంగసభ కోసం పరిశీలించారు. బహిరంగ సభ ఎక్కడన్నది అధికారికంగా ప్రకటించలేదు. ఈనెల 16న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేశ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు జిల్లాకు రానున్నారు. కలెక్టర్, ఎస్పీ వెంట ఆర్డీవో సందీప్‌కుమార్, డీఎస్పీ బాబుప్రసాద్, తహసీల్దార్, కర్నూలు రూరల్ సీఐ, ఎస్‌ఐ, సర్వేయర్ పాల్గొన్నారు.

బంగారం చోరీ

ఎమ్మిగనూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయిని వసంతలక్ష్మి ఇంట్లో చోరీ జరిగింది. వివరాలివీ.. వసంతలక్ష్మి ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా దసరా సెలవులకు ఊరెళ్లారు. సెలవులు ముగించుకొని శనివారం ఇంటికి వచ్చిన ఆమె ఇంటి తాళాలు తెరిచి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడంతో బంగారం చోరీటం, అందులోని బంగారం కనిపించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు తులాల బంగారం, కొన్ని వస్తువులు దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు అందిందని పట్టణ పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొవెలకుంట్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందూ నదిలో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాలు... మండలంలోని భీమునిపాడు గ్రామ సమీపంలో కుందూ నదిలో ఎగువ ప్రాంతం నుంచి శవం కొట్టుకు వచ్చింది. గ్రామస్థులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకొని శవాన్ని బయటకు తీశారు. తెల్ల జిబ్బా ధరించి, ఎర్రని మొలతాడు కలిగి ఉన్నాడని, సుమారు 40-50 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందన్నారు. ఎవరైనా ఆనవాళ్లు గుర్తిస్తే కోవెలకుంట్ల పోలీసుస్టేషన్ సంప్రదిం చాలన్నారు. శవం ఆచూకీ తెలిసినవారు సీఐ: 9121101173, ఎస్‌ఐ 9121101174 అనే నెంబర్లకు ఫోన్ చేయాలని ఎస్‌ఐ తెలిపారు.

చీఫ్ ఫార్మసీ అధికారిగా ప్రసాదరావు



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో ఆఫీసు చీఫ్ ఫార్మసీ అధికారిగా వై.ప్రసాదరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జీజీహెచ్‌లో సీనియర్ ఫార్మసీ అధికారిగా పని చేస్తున్న ఆయనను కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీస్ చీఫ్ ఫార్మసీ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ కడప ఆర్‌డీ డా.రామగిడ్డయ్య ఉత్తర్వులు జారీ చేశారు. 1985 నుంచి కర్నూలు మెడికల్ కాలేజీలో వివిధ హోదాల్లో పని చేశారు. జిల్లాలోని 35 పీహెచ్‌సీ, 8 అర్బన్ హెల్త్ సెంటర్లకు మందులు సరఫరా సక్రమంగా అయ్యేలా కృషి చేస్తానని ప్రసాదరావు తెలిపారు.

గుండ్రేవుల సాధనకు పోరాడుదాం..

కర్నూలు అర్బన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు పోరాడాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపకుడు శ్రీహర్ష పిలుపునిచ్చారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సి.బెళగల్ మండలంతో పాటు సంగాల గ్రామ రైతులతో గుండ్రేవుల ప్రాజెక్టు అంశంపై చర్చించారు. హరినాథ్ గౌడ్, సిహెచ్ శ్రీనివాసులు, వెంకట్, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీహర్ష

మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖిల్లా వీధి సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ఎండి.షరీఫ్ డిమాండ్ చేశారు. శనివారం రెండో వార్డులో పర్యటించారు. కమిషనర్, పాలకమండలికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు.

ఘనంగా శోభాయాత్ర

దసరా శరన్నవరాత్రుల్లో కొలువుదీరిన దుర్గమ్మ 11 రోజులు పూజలు అందుకున్నారు. ఈ క్రమంలో శనివారం అమ్మవారి నిమజ్జన వేడుకలు నగరంలో వైభవంగా సాగాయి. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర కోలాహలంగా సాగింది. సంస్కృతి, సంప్రదాయల మధ్య నిమజ్జనోత్సవం సాగింది. సంకల్‌భాగ్ వద్ద తుంగభద్ర నది, కేసీ కెనాల్ వద్ద ఉన్న వినాయక ఘాట్‌లో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఎస్పీ విక్రాంత్ పాటిల్, మేయర్ బీవై రామయ్య తదితరులు పాల్గొన్నారు. - కర్నూలు (ఆంధ్రజ్యోతి)



నిమజ్జనం సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు



దేవనగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శోభాయాత్రలో మహిళలు



బళ్లారి రోడ్డు వాసవీనగర్‌లో ఊరేగింపు



నిమజ్జనం..



వీడియో తీస్తున్న యువతి

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

● ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఎస్పీకి బొకే ఇస్తున్న సర్పంచ్ మోహన్ రెడ్డి

ఓర్వకల్లు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. శనివారం గుట్టపాడు గ్రామంలో ఈ నెల 16న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఉక్కు పరిశ్రమ గ్రామ సమీపంలో ఉండటంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఓర్వకల్లు నుంచి గుట్టపాడు నుంచి ఉక్కుపరిశ్రమ వరకు బీటీ రోడ్డు వేయాలని సర్పంచ్ మోహన్ రెడ్డిని కోరారు.

ఆటో డ్రైవర్లకు అండగా టీడీపీ



ఆటోడ్రైవర్లతో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కోడుమూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా నిలిచిందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం వాసవీ కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్ల సేవలో పథకం అమలుచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 2,440 మందికి రూ.15వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమచేశారన్నారు. ఈ పథకం అమలు చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఎంపీఐ గణేష్, ఎంపీడీవో రాముడు, రామకృష్ణారెడ్డి, పట్టెక్రిష్ణ, బడెసాగౌడ్ ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా ప్రభుత్వం

కల్లూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా నిలిచిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. శనివారం 36వ వార్డు ఉల్చాల రోడ్డు వై.జంక్షన్ నుంచి బళ్లారి రోడ్ సర్కిల్ వరకు ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అన్నివర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని, ఆటో డ్రైవర్ల సేవలో రూ.15వేలు ఇస్తానన్న హామీని చంద్రబాబు నెరవేర్చారన్నారు. కె.పార్వతమ్మ, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మునిస్వామి పాల్గొన్నారు.

ల్యాక్రోస్ క్రీడలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదర్శ కళాశాల మైదానంలో సౌత్‌జోన్ ల్యాక్రోస్ చాంపియన్‌షిప్ పోటీలను శనివారం ముఖ్యఅతిథులు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ, సౌత్‌జోన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ ప్రారంభించారు. రెండు రోజుల పాటు కొనసాగున్న ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నారు. ల్యాక్రోస్ క్రీడ ప్రాచీనమైనదని, 11వ శతాబ్దంలో అమెరికా దేశస్తులు ఆడేవారన్నారు. 2028లో ఒలంపిక్స్‌కు ల్యాక్రోస్ క్రీడను ఎంపిక చేశారన్నారు. డీఎస్పీ మహబూబ్ బాషా, డా. రామకృష్ణ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అనీ ప్రతాప్, శివరెడ్డి పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, హోంగార్డు కమాండెంట్

వృద్ధురాలి ఆత్మహత్య

కర్నూలు క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వడ్డే అనిత(60) ఆత్మహత్య చేసుకుంది. వివరాల మేరకు.. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఐదు మంది కూతుళ్లు ఉన్నారు. ఇటీవల పెళ్లిచేసిన కుమార్తెలు దసరాకు ఇంటికి రాగా, వీరి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. దీంతో అనిత శుక్రవారం వాజ్‌మోల్ తాగింది. కూమార్తెలు ఆసుపత్రికి తరలించగా.. కోలుకోలేక శనివారం మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

7న వాల్మీకి జయంతి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): 7వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శనివారం వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మహేష్ నాయుడు, మురళి, మంజునాథ్, తలారి కృష్ణ, రామచంద్రనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

జీఎస్టీ తగ్గింపును వివరించాలి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపును ప్రజలకు వివరించి, పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. శనివారం జీఎస్టీ తగ్గింపుకు సంబంధించి అవగాహన కార్యక్రమాల నిర్వహణపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక సమావేశాలను నిర్వహించేందుకు షెడ్యూల్ వేయాలని కర్నూలు అర్బన్‌లో ఇంకా 119 సచివాలయాలలో పెండింగ్ ఉన్నాయనీ రేపటికల్లా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జేసీ డా.నవ్య, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

పన్ను వసూలు వేగవంతం చేయాలి

కర్నూలు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరపరిధిలో ఆస్తి పన్ను, కొళాయి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. శనివారం సమావేశ భవనంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, అడ్మిన్ అమినిటిస్ కార్యదర్శులతో సమీక్షించారు. ఆస్తి పన్ను రూ.96.28 కోట్లు, కొళాయి చార్జీలు రూ. 15.05 కోట్ల డిమాండ్ ఉందని, ప్రణాళికా రూపొందించుకుని పన్ను వసూళ్ల పూర్తి చేయాలన్నారు. మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, జాప్యం తగదని స్పష్టం చేశారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవి కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్, ఎంఈ మనోహర్‌రెడ్డి, ఆర్ఐలు జునైద్, స్వర్ణలత, వాజీద్ పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ప్యాపిలి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా గొందిపర్లలో నిర్వహించిన కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో ప్యాపిలి చిత్తూరుపై 18-16 పాయింట్లతో నెగ్గింది. మూడో స్థానంలో గోనెగండ్ల, నాల్గవ స్థానంలో పంచలింగాల జట్లు నిలిచాయి. రాయలసీమ పేపర్ మిల్ ఎండీ శ్రీసత్య సాయిప్రసాద్, జీఎం కుదరత్ పీరా బహుమతులు అందజేశారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్ సహకరించారనీ నిర్వహకులు గోపాల్ తెలిపారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్-14, 17 బాలబాలికల తైక్వాండో ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు జోసెఫ్ లక్ష్మయ్య, తైక్వాండో సంఘం కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి టి.కృష్ణ ప్రారంభించారు.

అండగా చంద్రబాబు

గూడూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు అండగా నిలిచారని టీడీపీ నాయకుడు జె.సురేష్ అన్నారు. శనివారం కె నాగలాపురంలో ఆటో డ్రైవర్ల సేవలో.. నిధుల విడుదల సందర్భంగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ మద్దిలేటి, నాగ సుంకన్న, తిరుపాలు, గిడ్డయ్య, యుగంధర్ ఉన్నారు.



సీఎంకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



రైల్వేస్టేషన్ వద్ద క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

నగరంలో ఆటో డ్రైవర్ల ర్యాలీ

కర్నూలు అర్బన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సేవలో.. పథకం కింద రూ.15వేలు అందించడం అభినందనీయమని బొందిలి కార్పొరేషన్ చైర్మన్ డి.విక్రమ్ సింగ్ అన్నారు. శనివారం నగరంలోని 49వ వార్డులో ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మంత్రి టీజీ భరత్ ఆటో డ్రైవర్లందరికీ పథకం అమలయ్యేలా కృషి చేశారన్నారు. అలాగే టీడీపీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు కాసెపోగు ఏసన్న, సత్రం రామకృష్ణుడు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్‌లో ఆధ్వర్యంలో చంద్రబాబు, మంత్రి టీజీ భరత్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. నాగేశ్వరరావు యాదవ్, సి. నరసింహనాయుడు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. 8వ వార్డులో కార్పొరేటర్ కురవ పరమేష్ ఆధ్వర్యంలో చంద్రబాబు, మంత్రి టీజీ భరత్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు.



హుశేనాపురంలో మిఠాయిలు పంపిణీ చేస్తున్న రాజశేఖర్

శ్రమజీవులకు భరోసా

ఓర్వకల్లు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన ఆటో డ్రైవర్లకు భరోసాతో శ్రమ జీవులకు ఆర్థిక భరోసా లభించిందని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం హుశేనాపురం గ్రామంలో ఆటో డ్రైవర్లకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఏడాదికి రూ.15వేలు ఇస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సుతో నష్టపోయిన ఆటో డ్రైవర్లకు భరోసా ఇచ్చామన్నారు. మహబూబ్‌బాషా, బజారు, వేణు, కేవీ మదు, సుధాకర్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాలి



కరపత్రికలు విడుదల చేస్తున్న అధికారులు

ఓర్వకల్లు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని నియోగదారులకు అవగాహన కల్పించాలని జీఎస్టీ డీసీ నిర్మల సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రమణయ్య, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఏవో మదుమతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కోరారు. శనివారం ముజఫర్‌నగర్‌లో నల్సా పథకాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో నిత్యం జరుగుతున్న అకృత్యాలు, జర్నలిస్టులపై దాడులు, బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రజలు కృషి చేయాలన్నారు. బుడగ జంగాలు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా చూడాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రుల తో పాటు ప్రోత్సహించిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. శిక్షణలో ఉన్న న్యాయవాదికారులు కే.హేమ, ఎస్.లక్ష్మి, జి.అపర్ణ, పి.హేమ, కర్నూలు ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొండయ్య, డీసీపీవో శారద, చైల్డ్ వెల్ఫేర్ కమిటి చైర్మన్ జుబేర్, లీగల్ సర్వీసెస్ మెంబర్ డా.రాయపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి : డీఐవో

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ఉమ పేర్కొన్నారు. శనివారం నగరంలోని పెద్దపాడు, వీకర్‌సెక్షన్ కాలనీలో టీకాలు వేయడాన్ని పరిశీలించారు. గర్భిణులు, 5 సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. మిజిల్స్, రూబెల్లా కార్యక్రమంలో భాగంగా ఎంఆర్ 1, ఎంఆర్-2 టీకాలు వందశాతం పూర్తి చేయాలని ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను ఆదేశించారు.



చిన్నారికి టీకా వేస్తున్న డీఐవో డాక్టర్ ఉమా

ప్లాస్టిక్ వద్దు.. జ్యూట్ ముద్దు

కోడుమూరు రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం వద్దని, జ్యూట్ బ్యాగుల ను వాడాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. శనివారం కృష్ణాపురం గ్రామంలో ప్లాస్టిక్ అనర్థాలపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌తో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, ప్లాస్టిక్ మట్టిలో కలవడానికి వందల ఏళ్లు పడుతుందన్నారు. అనంతరం ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యకర్తలు రాధ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

'ట్రాఫిక్ ఇబ్బందులు పట్టించుకోరా?'

ఆదోని టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : 160 సంవత్సరాల క్రితం ఏర్పాటైన ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 25 వేల జనాభా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన రహదారులే ఇప్పటికే కొనసాగుతూ ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణ జనాభా 3 లక్షలకు చేరుకుంటున్నా, రహదారులు మాత్రం విస్తరించకపోవడంతో ప్రజలు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోవడమే కాకుండా అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రత్యేక గ్రాంటు తీసుకొని రావడానికి ఎమ్మెల్యే పార్థసారధి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

సేవా గుణం కలిగి ఉండాలి

మద్దికెర అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో సేవా గుణం కలిగి ఉండాలని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ వ్యవస్థాపకులు విజయప్రసాద్ యాదవ్ అన్నారు. శనివారం మద్దమ్మకుంట గ్రామ సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో విద్యుత్ కార్మికులకు దుస్తులతో పాటు స్వామివారి షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరులో సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవాలు జరుగుతాయన్నారు. షష్టి ఉత్సవాలకు ప్రజలు సహకరించాలని కోరారు. సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం రాతి దేవాలయంగా నిర్మాణం చేపట్టదలచామని, దాతలు ముందుకు వచ్చి మీ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మెన్లు వెంకటరమణ ఉన్నారు.

'చలో విజయవాడ' కు ఉపాధ్యాయులు కదలిరావాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాల్సిన ఏడో తేదీనా ఫ్యాప్టో తలపెట్టిన విజయవాడకు ఉపాధ్యాయులంతా భారీగా తరలిరావాలని ఫ్యాప్టో జిల్లా సెక్రెటరీ భాస్కర్ పలుపునిచ్చారు. శనివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిన ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి తప్పించాలన్నారు. పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నాగరాజు, రమేష్ నాయుడు, చంద్రశేఖర్, సీ నాగరాజు, వీరచంద్రయాదవ్, లక్ష్మయ్య, రామస్వామి పాల్గొన్నారు.

అందుబాటులోకి నిత్యావసరాల ధరలు

దేవనకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ స్లాబులతో నిత్యవసర ధరలు పేదలకు అందుబాటులో ఉంటాయని కమర్షియల్ ట్యాక్స్ డి ప్యూటి కమిషనర్ రమణ రెడ్డి, డీడీవో రామచంద్రరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ భవనంలో సర్పంచులకు, ఎంపీటీసీలకు, పంచాయతి కార్యదర్శులకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై సమావేశం నిర్వహించారు. తగ్గిన జీఎస్టీ ఉపయోగాలను ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో జ్యోతి, డీప్యూటీ ఎంపీడీవో గోపాల్, ఏవో నాగమ్మ, ఏపీఎం లక్ష్మమ్మ, పాల్గొన్నారు.

పంచాయతీ భవనం పనులు ప్రారంభించండి

మద్దికెర అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలోని పంచాయతీకి ఉపాధి హామీ నిధుల కింద రూ.45 లక్షలు నిధులు మంజూరయ్యాయనీ, పనులు మొదలు పెట్టాలని పంచాయతీరాజ్ ఏఈ విష్ణు, సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. శనివారం మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలోని నూతన పంచాయతీ భవనం కొరకు 744 సర్వే నెంబరులో 5 సెంట్ల స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. వీఆర్వో రంగస్వామి, సర్వేయర్లు ఉన్నారు.

అందరికీ అండగా ప్రభుత్వం

- హామీల అమలుతో ఏపీకి పూర్వ వైభవం
- ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- చెక్కులు పంపిణీ చేసిన నేతలు



ఆదోని: ఆటో డ్రైవర్లకు చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు



పత్తికొండ: ఆటోడ్రైవర్లకు చెక్కును అందిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు



ఆలూరు: 'ఆటో డ్రైవర్ల సేవలో' చెక్కును అందిస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి, టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ

ఆదోని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆటో డ్రైవర్ల సేవలో పథకం నిధులను మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, అబ్జర్వర్ సుబ్బారెడ్డి పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఇది నిజమైన పండగ అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అన్ని విధాలుగా అమలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఆదోనిలో ఆటో డ్రైవర్లు తనకు ప్రత్యేకం అని, వారు తాను ఎమ్మెల్యే కావడానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, అబ్జర్వర్ సుబ్బారెడ్డి, విట్టా రమేష్, కమిషనర్ కృష్ణ పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండలంలో బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం టీడీపీ జిల్లా నాయకుడు సుబ్బారాయుడు ఆటోడ్రైవర్లతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు వారి అకౌంట్‌లో జమచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

పత్తికొండ: రాష్ట్రంలో అన్నివర్గాలకు అండగా నిలుస్తూ టీడీపీ ప్రభుత్వం ముందుకుసాగుతుందని టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలినాగేంద్ర, బత్తినివెంకట్రాముడు అన్నారు. ఎంపీడీవో కవిత ఆధ్వర్యంలో పత్తికొండ టీటీడీ కల్యాణ మండపంలో ఆటోడ్రైవర్లసేవలో పథకం ప్రారంభోత్సవం నిర్వహించారు. రాష్ట్రట్రైబల్ బోర్డు సభ్యుడు వెంకటపతి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఆలంకొండ నబీసాహెబ్, తిమ్మయ్యచౌదరి, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, ఆర్డీవో అజైస్, డిప్యూటి ఎంపీడీవో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ అన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు వైకుంఠం శివప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ జయరాం, ఏబీసీ డీసీ చైర్మన్ కిష్టప్ప, బీజేపీ ఇన్‌చార్జి వెంకటరాముడు, జనసేన నాయకులు రంజిత్, ఛత్రపతి, మున్నా, టీడీపీ మండల కన్వీనర్లు అశోక్, వల్లిబాసా, పరమరెడ్డి, విజయ్, ఎంపీడీవో అల్లాబకాష్, టీడీపీ నాయకులు విష్ణు, వెంకటేష్, చౌదరి, కృష్ణయాదవ్, సీనప్ప, ఉచ్చీరప్ప, రామారావు, శాలిసాహెబ్, సంజన్న, మేకల రంగనాథ్, నరసప్ప, కిషోర్, సతీష్, రామారావు, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు మున్నా పాల్గొన్నారు.

మద్దికెర: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడు అని మాజీ జడ్పీటీసీ సభ్యులు పి.పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెరవలి రామాంజులు, శ్రీరాములు, గొడుగు సతీష్ కుమార్, గడ్డం మల్లికార్జున, సుగ్గలప్ప పాల్గొన్నారు.

తుగ్గలి: కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారనీ రైతు సంఘం తాలుకా అధ్యక్షులు బాలన్న, టీడీపీ నాయకులు మిద్దె వెంకటేష్ యాదవ్, రవికుమార్ అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా వంద శాతం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమం అందించడం మన ముఖ్యమంత్రికే సాధ్యమన్నారు.

ఆదోని: ఆటో డ్రైవర్లకు అండగా నిలవాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. శనివారం ఆటో డ్రైవర్లతో కలిసి సీఎం చంద్రబాబునాయుడి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కృష్ణమ్మ మాట్లాడారు. టీడీపీ నాయకులు మురళి, మాజీ కౌన్సిలర్ మారుతి, ఓంకార్, వీఎం గోపాల్, కల్లుబావి మల్లికార్జున, మహాదేవ, మునిస్వామి, యల్లప్ప పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న శారదా శంకర్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆదోని మార్కెట్ యార్డులో నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు

ఆదోని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు పేర్కొన్నారు. శనివారం ఆదోని మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బి.టి.నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప హాజరయ్యారు. ముందుగా చైర్మన్ జిందే శారదావంకర్, వైస్ చైర్మన్ ఆదూరి విజయ్‌కృష్ణ, డైరెక్టర్లు బి.ఎస్.మనోహర్‌రావు, కొలిమి పల్లవితో పాటు మరో 11 మంది డైరెక్టర్ల చేత మార్కెట్‌యార్డు కార్యదర్శి గోవిందు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మాట్లాడారు. 1976లో తాను ఆదోని మార్కెట్‌లో వ్యాపారం మొదలు పెట్టానని గుర్తు చేశారు. కొత్త పాలకవర్గం రైతుల అవసరాలు తీర్చే పనులు చేపట్టాలని సూచించారు. . అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ మార్కెట్‌యార్డు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మార్కెట్‌యార్డు కళకళ్లాడితేనే ఆదోని బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇది రాష్ట్రంలోనే అతి పెద్ద మార్కెట్ కాగా రాయలసీమలోనే అతి పెద్ద మార్కెట్ కావడంతో రైతులు తమ దిగుబడులను తీసుకొస్తారని, వారికి మంచి ధర లభించినపడే వారిలో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అమౌంట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారుల వైఫల్యం వల్ల సకాలంలో ఇవ్వలేకపోడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని కలెక్టర్ సిరి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు కూడా సరిగా పనిచేస్తారని, అందుకే ఆదోనిని నాలుగు మండలాలుగా ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో అడిగానని తెలిపారు. ఆదోని జిల్లా అయితేనే ఆదోని అభివృద్ధి చెందుతుందని పునరుద్ఘాటించారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, తిక్కారెడ్డి, మల్లప్ప వేర్వేరుగా మాట్లాడారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి రైతుల పంట ఉత్పత్తులకు లాభసాటి ధర అందించేందుకు కృషి చేయాలని సూచించారు. చైర్మన్ జిందే శారద మాట్లాడుతూ రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి యార్డులో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు, హమాలీలు, గుమస్తాలు అధికారుల సమన్వయంతో మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని కుబేర్‌నాథ్, టీడీపీ రాష్ట్ర నాయకుడు భూపాల్‌చౌదరి, తెలుగు యువత నాయకులు మారుతినాయుడు, సిద్ధార్థనాయుడు, బసాపురం వెంకటేష్, డైరెక్టర్లు ఉరుకుంద రెడ్డి, శారదా ఫర్హానాబేగం, బ్రహ్మానందం, శ్రీనివాస ఆచారి, రామకృష్ణ, రత్నాబాయి, మహేశ్వరి, ఖాదర్‌బాషా, పార్వతి పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని 6వ తేదీన తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని రైతు కార్యదర్శి సురేంద్రకుమార్, రామాంజనేయులు పిలుపునిచ్చారు

బుక్ కీపర్‌పై కొనసాగుతున్న విచారణ

దేవనకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పి.కోటకొండ బుక్‌కీపరు మిన్నెల హుసేన్ (వలి)పై విచారణ కొనసాగుతోంది. పి. కోటకొండ గ్రామానికి చెందిన ఎనిమిది సంఘాల ఫిర్యాదుతో అవినీతి వెలుగులోకి వచ్చిన చర్యలు తీసుకొవడంలో అధికారులు మీన లమేషాలు లెక్కించడం జరుగుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు అండదండలతో యద్ధేచ్ఛగా అవినీతి పనులు కప్పిపుచడం జరిగింది. గత నెల క్రితం గ్రామానికి చెందిన ఝాన్సీలక్ష్మిబాయి, లలిత, కౌసల్య, జయంతి,సుజాత,భవిత, శ్రీరంగా, వైజయంతి సంఘాలలో స్త్రీనిధికి సంబంధించిన నిధులలో దాదాపు రూ.5.87 లక్షలు పైగా అవినీతి బయటపడింది. గ్రామంలో 20 రోజుల క్రితం ఒకసారి, శనివారం సాయంత్రం వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజరు అబ్దుల్ రహిమాన్, ఏపీఎం లక్ష్మమ్మ, సీసీ కర్రెన్న 8 సంఘాలతో మాట్లాడారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

వెల్దుర్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నాయకంటి గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం వెల్దుర్తి ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం దేవళంపేటలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టారన్నారు. దుశ్చర్యకు పాల్పడ్డ నిందితులను పట్టుకొని కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు

తుగ్గలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మనకు విద్యాబుద్దులు నేర్పించిన పాఠశాల, వసతులు ఇచ్చిన ఎస్సీ హాస్టల్ రుణం తీర్చుకుందామని ఎస్సీ హాస్టల్ పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఎస్సీ హాస్టల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన పూర్వ విద్యార్థులందరూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకరికొకరు పలకరించుకుని సంతోషంగా గడిపారు. అలాగే విద్యనేర్పించిన గురువులకు హాస్టల్ వార్డెన్లకు తహసీల్దార్ రవి, మధులను శాలువ కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.పెండేకల్ ఆర్ఎస్ ఎస్సీ హాస్టల్ పూర్వ విద్యార్థులు, హెచ్ఎం విజయలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ అమీనా, ఉపాధ్యాయులు భూషప్ప, వార్డెన్లు జయచంద్ర, సుంకప్ప, సుంకన్న తదితరులు ఉన్నారు.

పనులు గుర్తించండి

మద్దికెర అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని మేటీలు ఉపాధి పనులు కల్పించేందుకు పనులు గుర్తించాలని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. మండలంలోని మద్దికెర, ఎడవలి గ్రామాల్లోని సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి పనులు ప్రారంభమయ్యే లోపు పనులు చేసే పొలాల్లో పాస్‌బుక్, ఆధార్ కార్డు, రైతుల నుంచి తీసుకుని ఆన్‌లైన్ చేయాలన్నారు. జాబ్‌కార్డులకు ఈకేవైసీ చేయించుకోవాలని లేకపోతే ఉపాధి పనులు కల్పించలేమని తెలిపారు. ఉపాధి పనుల్లో అవినీతి నిర్మూలన కోసం ముఖ హాజరును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేశాయన్నారు. టీఏ సుధాకర్, ఎఫ్ఏ రాజ్‌కుమార్ ఉన్నారు.

దేవాలయ అభివృద్ధికి సహకరించాలి

మద్దికెర అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని దేవాలయ చైర్మన్ పారా రవికుమార్, ఆలయ ఈవో వీరయ్య అన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం

- ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- 'ఆటో డ్రైవర్ల సేవలో' టీడీపీ నాయకులు
- నగదు జమపై లబ్ధిదారుల హర్షం



మంత్రాలయంలో చెక్కు అందజేస్తున్న ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, డీపీవో భాస్కర్



కౌతాళంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు



నందవరం నుంచి ఎమ్మిగనూరుకు బయలుదేరుతున్న నాయకులు, డ్రైవర్లు

మంత్రాలయం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు, రైతులకు, పారిశ్రామికవేత్తలకు, ఆటోడ్రైవర్‌లకు ఇలా అన్ని న్యాయం చేస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తోందని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మాధవరం నుంచి వందలాది ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీటీడీ కల్యాణ మంటపంలో ఆటోడ్రైవర్ సేవలో భాగంగా డీపీవో భాస్కర్, డీఎస్పీవో తిమ్మక్క, ఎంపీడీవో నూర్జహాన్, ఆర్డీవో రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదలచేసి ఆటోడ్రైవర్‌లకు చెక్కును, డ్రైవర్‌లకు రూ.15వేలు బ్యాంకులో జమ అయిన సమాచారాన్ని చూపించారు. రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ కోసిగి 189 మంది, కౌతాళం 172 మంది, మంత్రాలయం 540 మంది, పెద్దకడబూరు 271 మంది, మొత్తం 1,172 మందికి రూ.15వేలు ప్రకారం రూ. 1,75,80,000 మంజూరయ్యాయని తెలిపారు. ఇంకారాని డ్రైవర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించారని చెప్పారు. కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప మాట్లాడుతూ సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కావడంతో ఓర్వలేక వైసీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, రాకేశ్‌రెడ్డి, ఎస్ఐ శివాంజల్, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, వరదరాజు, కంసాలి నరసింహ, సొసైటీ డైరెక్టర్లు డీసీ తిమ్మప్ప, చాపల నగేష్, పల్లిపాడు రామిరెడ్డి, ముత్తురెడ్డి, నర్సరెడ్డి, అయ్యన్న, టిప్పుసుల్తాన్, అడివప్పగౌడు, వెంకటపతిరాజు, అశోకరెడ్డి, ఉరుకుంద, బొజ్జప్ప, చాకలి రాఘవేంద్ర, విజయ్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

కౌతాళం: కూటమి ప్రభుత్వంతోనే ఆటో డ్రైవర్లు నిజమైన పండుగ జరుపుకుంటున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అన్నారు. కౌతాళంలో శనివారం కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఆటో డ్రైవర్లతో కలిసి ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప ఆటో డ్రైవర్లతో కలిసి సీఎం చిత్రపటానికి కౌతాళం ఆర్టీసీ బస్టాండ్ వద్ద క్షీరాభిషేకం చేశారు. తమ బాధలను గుర్తించి తమకు ఒక మంచి పథకాన్ని ప్రవేశ పెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కూటమి నాయకులకు తాము రుణపడి ఉంటామని డ్రైవర్లు కిష్టప్ప, రాంపురం బాషా, మాబాషా అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజబాబు, సిద్ధు, సోమన్న, డింగి రఘరామ, డ్రైవర్లు కరీం, హాజీ ఉన్నారు.

ఎమ్మిగనూరు: కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో ఆటో డ్రైవర్లు ఆర్థికంగా బలపడాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కుర్ని కమ్యూనిటీ హాల్‌లో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించారు. ఆదోని ఎంపీఏ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టీడీపీ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ హాజరయ్యారు. అంతకు ముందు స్థానిక మార్కెట్ కమిటీ నుంచి టీడీపీ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వందలాది ఆటోలతో పట్టణంలో భారీర్యాగా కుర్ని కమ్యూనిటీ హాల్‌కు చేరుకున్నారు. హాల్ దగ్గర సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం టీడీపీ నాయకులు చంద్రశేఖర్, మాచాని మహేశ్, బీజేపీ నాయకులు నరసింహులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 1206మంది ఆటో డ్రైవర్లకు రూ. 15వేల చొప్పున రూ. 1.81 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. అనంతరం అధికారులు, నాయకులు ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేశారు. ఆయా మండలాల అధికారులు, టీడీపీ నాయకులు కాశీంవలి, వెంకట్రామిరెడ్డి, చిన్నరాముడు, ధర్మాపురం గోపాల్, మహేంద్ర బాబు, తిరుపతయ్య నాయుడు, ఎన్వీ రామాంజనేయులు, కలీముల్లా, రంగస్వామి గౌడ్, బుగిడే నాగరాజు, షాలేమ్, సోగనూరు జగదీశ్, నరసప్ప పాల్గొన్నారు.

నందవరం: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్రంలోనే కూటమి ప్రభుత్వం టాప్‌గా నిలిచిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈరన్నగౌడు, చేనేత సొసైటీ కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ రాముడు అన్నారు. శనివారం నందవరం, ముగతి, సోమలగూడూరు, ధర్మాపురం తదితర గ్రామాల నుంచి ఆటోల డ్రైవర్లతో కలిసి ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుకు ర్యాలీగా వెళ్లారు. టీడీపీ నాయకులు, ముగతి భార్గవ్‌యాదవ్, నందవరంలో టీడీపీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దరాముడు, మస్తాన్, బోయ కడుబూరి, కొండయ్య, మోడల్ స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ రవి పాల్గొన్నారు.

కోసిగి: ప్రభుత్వం ఆటో డ్రైవర ఖాతాలో రూ.15వేలు జమ చేయడంతో ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. కోసిగికి చెందిన జానకల్ మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని ఏడాదికి రూ.15వేలు ఇవ్వడం చాల సంతోషించదగ్గ విషయమన్నారు. నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో పెండింగ్ కంతులను కటుకుంటానని చెప్పారు. బాబు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ఆటో డ్రైవర్‌లను ఆదుకోవాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబురూ.15వేలు ఇచ్చారని, కూటమి ప్రభుత్వానికి ఆటో డ్రైవర్లు అండగా ఉంటామని అన్నారు.



కోసిగిలో ఆనందం వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు



ఎమ్మిగనూరు: ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న అధికారులు, ఆటోలతో ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనం



గోనెగండ్ల, పెద్దనేలటూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న అమ్మవారు

గోనెగండ్ల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో నిమజ్జనోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహిం చారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం గాజులదిన్నె ప్రాజెక్టులో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. పెద్దనేలటూరులో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని చిన్ననేలటూరు చెరువులో నిమజ్జనం చేశారు.

శ్రీమఠంలో ద్వాదశి వేడుకలు

మంత్రాలయం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహారించారు. శనివారం అశ్వయుజ ద్వాదశి శుభదినంను పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారు జామునుంచే బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పశు వైద్యసేవలు అంతంత మాత్రమే..



కోసిగిలో మూసివేసిన పశు వైద్యశాల

కోసిగి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని పశువైద్యశాలకు డాక్టర్ విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో అటెండరే ఆసుపత్రికి దిక్కయ్యారు. దీంతో పశు పోషకులు రైతులు, ప్రజలు పశువులను గొర్రెలు, మేకలను ఆసుపత్రికి తీసుకువచ్చి వెనుదిరిగి వెళ్తున్నారు. ఉన్న సిబ్బంది కూడా సమయ పాలన పాటించకపోవడంతో ప్రతిరోజూ 2 గంటలకే వైద్యశాలకు తాళాలు వేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశు వైద్యాధికారి వెంకట సుబ్బయ్య మంత్రాలయం, కోసిగి పశు వైద్యశాలలో విధులు నిర్వహిస్తుండటం వల్ల కోసిగి వైద్యశాలకు వారానికి ఒకసారి మాత్రమే వచ్చి వెళ్తున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. ఏడీ వెంకట సుబ్బయ్యను వివరణ కోరగా.. వారానికి రెండు సార్లు విధులకు హాజరవుతున్నామని, మంత్రాలయం కూడా తమకు ఉండంటతో ప్రతిరోజు విధులకు సమయవేళలకు హాజరు కాలేకపోతున్నామని, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చూస్తామని తెలిపారు.

8న తేనె టీగల పెంపకంపై శిక్షణ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 8న తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10గంటలకు శిక్షణా కార్యక్రమం ప్రారంభమవుతుందని, శిక్షణలో పాల్గొనే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించ నున్నట్లు తెలిపారు. శిక్షణ తర్వాత సర్టిఫికెట్‌తో పాటు సబ్సిడీ కింద తేనెటీగల పెంపకం బాక్సులను అందజేయనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్‌తో భక్తుల అవస్థలు



రాఘవేంద్ర సర్కిల్‌లో అస్తవ్యస్తంగా నిలిచిపోయిన వాహనాలు

మంత్రాలయం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పట్టించుకోవాల్సిన పోలీసులు నియంత్రణ చేయలేక చేతులెత్తాశారు. దీంతో సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదురొన్నారు. దసరా రావడంతో శని, ఆదివారాలు వరసగా సెలవు దినాలు కావడంతో రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ముఖద్వారం, శ్రీమఠానికి వెళ్లే ప్రధాన రహదారి, సంస్కృపాఠశాల కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, మాధవరం హైవే రోడ్డు, పోలీసు స్టేషన్ ఎదురుగా, నాగలదిన్నె రోడ్డు, బస్‌స్టాండ్ రోడ్డుకు ఇరువైపులా, ఆర్టీసీ బస్టాండ్, తహసీల్దారు కార్యాలయం, సంతమార్కెట్, జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో భక్తులు పార్కింగ్ చేశారు. శ్రీమఠంకు వెళ్లే ప్రధాన రహదారులు, ముఖద్వారం వద్దకు ఆటోలకు అనుమతిలేకపోయిన ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపి భక్తులను ఎక్కించుకోవడం, అద్దె మాట్లాడుకోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కరంగా మారింది. లాడ్జీలు, హోటళ్ల దుకాణాల యజమానులు ఆర్అండ్‌బీ రోడ్డును, పంచాయతీ స్థలాన్ని కబ్జాలు చేసిన పట్టించుకునేవారే లేరు. లాడ్జీలు,హోటళ్లకు పార్కింగ్‌కు స్థలాలు లేకపోవడం ప్రధాన రహదారులకు ఇరువైపులా పార్కింగ్ చేయించడంపై భక్తులు మండిపడుతున్నారు.

ఉన్న సిబ్బందితోనే ట్రాఫిక్ నియంత్రిస్తున్నాం



మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో వివిధ బందోబస్తులకు వెళ్లడం వల్ల ఉన్న సిబ్బందితోనే ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం. జిల్లా అధికారులకు సెలవురోజుల్లో అదనపు సిబ్బంది కావాలని కోరుతున్నాం. వివిధ ఉత్సవాలకు బందోబస్తుకు వెళ్లడం వల్ల సిబ్బంది కొరత ఏర్పడింది. శ్రీమఠం అధికారుల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణకు పూర్తిస్థాయిలోచర్యలు తీసుకుంటాం.

- భార్గవి, డీఎస్పీ, ఎమ్మిగనూరు

శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలికి సన్మానం

గోనెగండ్ల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవాలయం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితులైన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రేఖాగౌడ్‌ను శనివారం గోనెగండ్ల నాయకులు సన్మానించారు. గానుగ బాషా, మాలిక్, నాగేష్, కాశీం సాహెబ్, ఉత్తేజ్, వినోద్, మధు, మునిస్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.



నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: ఎమ్మెల్యే



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

పెద్దకడబూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపో యిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కంబళదిన్నె గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, ఉల్లి, మిరప పంటలను ఆయన పరిశీలించారు. వైసీపీ నాయకులు పురుషోత్తమ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, సత్యగౌడ్, మూకయ్య, ముక్కరన్న, అర్లప్ప, ఈరన్న పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

నందవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఇటీవల ప్రకటించిన జీఎస్టీ 2.0తో నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు తగ్గుతాయని చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ రాముడు తెలిపారు. శనివారం సోమలగూడూరులో టీడీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలి, సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, సోమలగూడురు చంద్ర, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపైకి డ్రైనేజీ నీరు



ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు

మంత్రాలయం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్ పక్కనే ఉన్న సీఆర్వో కార్యాలయం వద్ద అండర్ డ్రైనేజీ పొంగి పొర్లింది. దీంతో మురుగునీరు రోడ్డు ప్రధాన రోడ్డుపై ప్రవహించడంతో మురుగు కాల్వ నుంచి వచ్చిన దుర్వాసనకు దుకాణాలనన్నీ మూతపడ్డాయి. డ్రైనేజీ నుంచి వచ్చే దుర్వాసన వల్ల భక్తులు, గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు.



